# దడదడా బడబడా కొట్టింది తుపాను

'శ్రీదరా... యియ్యాల రాత్రికి మా పక్కలు మీ యింట్లోనే అంటరా. మీ అమ్మొచ్చి మా అమ్మని పిలస్తా ఉన్నింది పొద్దున. అబ్బా బలే ఉంటుందిరా తుపానులో. రాత్రంతా మనం ఒకే మంచం మీద పొణుకొని బటాని పొప్పులు తింటా బలే బలే మాటలు చెప్పు కుందాముర' అన్నాడు కందుల మాలకొండరావుగాడు శ్రీదరుగాడితో పైకి చూస్తా.

పైన ఆకాశం మూసుకొని వొస్తా ఉంది. మొబ్బులు కమ్ముకుంటా ఉన్నాయి.

'బంగాళాకాతములో ఏర్పడిన వాయుగుండము రానున్న నలబై ఎనిమిది గెంటల్లో అలివిగానంతగా బలపడి ఈ పక్క నెల్లూరులోగానీ ఆ పక్క ఒంగోలులోగానీ లాకుంటే నడి మద్యన కావలిలోగాని తీరాన్ని దాటవచ్చు. దాని ప్రబావానికి చెట్లు కూలవచ్చు. రేకులు ఎగరవచ్చు. స్తంబాలు వాలవచ్చు' అని రేడియోల్లో చెప్తానే ఉన్నారు, తుపానుకు ముందరి వానలు పడతానే ఉన్నాయి, అయినాగాని మా కుమారస్వామి ఐవోరు ఆ ముందురోజు ఉలకలా పలకలా.

'రేప్పొద్దున కూడా ఇస్కూలికి రాండి. అంతగా తుపాను కొడితే అప్పుడు చూద్దాం' అన్నాడా కటినాత్ముడు.

దాంతో మేము సచ్చినట్టుగా గొడుగులు తీసుకొని, లేనోళ్లు నెత్తికి ప్లాస్టీకు కవర్లు పెట్టుకొని జల్లు కొడతా ఉంటే సస్తా బతకతా ఇస్కూలికి చేరుకున్నాం. కానీ చేరుకున్న గెంటకే ఆకాశం నల్లంగా అయిపోయింది. కిలాసులు చీకటి చీకటిగా అయిపోయినాయి. పస్టుపిరీడు తెలుగు చెప్తా ఉన్న నరసయ్య ఐవోర్లు పాటం ఆపి, కిటికీ కాడికి పొయ్యి, బయటికి తొంగి చూస్తా, 'ఒహో... ఇయ్యాల మూడిందిరో మనకో' అన్నాడు వేడికి చేతులు రుద్దుకుంటా.

మేం కూడా కిటికీల్లో నుంచి తలకాయలు బయట పెట్టి చూసినాం. ముద్దగా ఉంది అంతా. మరి కాసేపట్లో లాంగుబెల్లు కొట్టక పోతే యింకీ రోజు పగలూ రాత్రీ జాగారం యిణ్ణే అని మాకు అర్ధమైపోయింది.

'ఏమి చేద్దాము సార్' అని అంటా ఉండగానే కుమారస్వామి ఐవోరికి కూడా డౌటు వచ్చిందో ఏమో, ఆఫీసు రూంలో నుంచి బయటికొచ్చి, కళ్లద్దాలు తీసి చేత్తో పట్టుకొని, ఆకాశం వంకా మబ్బుల వంకా తొంగి తొంగి చూసి, 'సరే. ఏం చేస్తాం. పదండి ఇళ్లకి' అని లాంగుబెల్లు కొట్టించేశాడు.

'హు. ఇంతకాడికి ఈడదాకా రప్పించడం దేనికి? వొచ్చినాక లాంగుబెల్లు కొట్టి పంపించడం దేనికి. ఈ సంబడం నిన్నే చెప్పుంటే ఈపాటికి ఇళ్లల్లో వెచ్చంగా దుప్పటి కప్పుకొని పొణుకొని ఉండేవాళ్లం గదా' అని తిట్టుకుంటా ప్యాంటు పైకి మడిచి కిలాసులో నుంచి బయటపడినాడు నరసయ్య ఐవోరు.

ఆయన ఎనకనే పిలకాయలమందరం బిలబిలమంటా బయటికొచ్చేసినాం. శ్రీదరు గాడూ నేనూ ఒక గొడుగులో మాలకొండరావూ మురళీగాడూ ఇంకో గొడుగులో గబ గబా ఇంటికి నడస్తా ఉంటే మాలకొండరావు అన్నాడు-

'శ్రీదరా. మాది రేకుల యిల్లు గదరా. రాత్రికి తుపాను కొడితే కష్టమవుద్దని మీ అమ్మొచ్చి మమ్మల్ని పిలిచింది. అన్నాలు కూడా ఒండుకోవద్దని చెప్పింది. సాయంత్రం అయ్యే సరికి మేము మీ యింటికి వొచ్చేస్తాములా' అన్నాడు శ్రీదరుగాడితో.

'మీ సంగతి సరేరా. మరి యీళ్ల సంగతి ఏందిరా?' అన్నాడు శ్రీదరుగాడు మాతో.

'మాకు ఆ చాన్సు లేదుగదరా. మీ అంతది గాకపోయినా మాది కూడా శ్లాబు బోసి గట్టిన మిద్దే గదరా. మాకు బయం లేదురా' అన్నాను నేను.

'మాది పెంకుటిల్లే అయినా పాతకాలం నాటి ఇల్లుగదరా. గట్టిగా ఉంటుంది. ఇంటి ముందర యాపచెట్టు ఉందనే బయమే గానీ ఇల్లు కదలద్దని బయం లేదురా' అన్నాడు మురళీగాడు.

'అబ్బా. మీరిద్దరు కూడా మా యింటికి వస్తే బాగుండురా. రాత్రికి బలే బలే ఎంజాయ్ చేయొచ్చురా' అన్నాడు శ్రీదరుగాడు.

'నిజమేరా. మేము మిస్సవతా ఉన్నాములా' అన్నాము మేము.

మా మాటలు వింటా ఉంటే, ఇదేందిది ఒక పక్క తుపాను కొడతా ఉంటే, ఈ పిలకాయలేంది యిట్టా హుషారుగా మాట్లాడుకుంటా ఉన్నారు అని ఆచ్చర్యపోతా ఉన్నారా? మరేం చేస్తాం. మా ఊరి కత అట్టాంది.

మాకు టయానికి వానలు పడనే పడవు. డిల్లీ దూరదర్శన్‌లో బూజర బూజరగా ఉన్న వాతావరణం మ్యాపు చూపించి 'మద్‌దాతా సంవాద్‌దాతా ఛాయాచిత్ర్‌కే అనుసార్' లాంటి హిందీ మాటలు మాట్లాడి 'ఇంక ఎన్టీఆరు స్టేటు వానలతో మునిగిపోతా ఉంది' అని చెప్పినా సరే మాకు వానలు పడవు. నెల్లూరు దాకా పడతాయి. లేకుంటే ఒంగోలు శింగరాయకొండదాకా పడతాయి. కావలి అనంటే మాత్రం మొకాలు తిప్పుకొని ఎళ్లిపోతాయి.




అందుకే మాకు వానలు రావాలంటే ఆగస్టు నెల రావాల. ఆ నెల్లో బంగాళాకాతంలో యాణ్ణో ఒక దిక్కడ వాయుగుండం పడాల. అయితే మాకన్నా తుపాను గొట్టాలా. లేకుంటే యాడైనా తుపానుగొట్టి మాకు కుంబవృష్టన్నా కురవాల. అప్పుడే మాకు వానలు.

అందుకని మా ఊళ్లో తుపాను అనే మాట వినబడితే చాలు మిద్దెలున్నోళ్లు పెంకుటిళ్ల వాళ్లనీ పెంకుటిళ్లు ఉన్నోళ్లు పూరిళ్ల వాళ్లనీ యిళ్లకి పిలవడం రివాజు. అందరు కలిసి రాత్రంతా మాటలు చెప్పుకుంటా, రేడియోలు వింటా, వానలు చూస్తా గడపడం ఆనవాయితీ. అందుకనే మేము కూడా అట్లా మాట్లాడుకుంటా నడస్తా ఉండేసరికి వాన పెద్దదయ్యింది. పోలేరమ్మ బండకాడికి వచ్చేపాటికి యింకా పెద్దదయ్యింది.

'సరేరా. రేపు కలుద్దాము రా. రాత్రికి జాగ్రత్తరా' అనుకొని నలుగురం విడిపొయ్యాం.

ఇంటికి పొయ్యే సరికి మా నాయన అప్పటికే అంగడి మూసేసి బజారు నుంచి వొచ్చున్నాడు. వస్తా వస్తా తుపాను సరంజామా అంతా తెచ్చున్నాడు.

టార్చిలైటులోకి ఒక సెట్టు బ్యాటరీ, రేడియోలోకి ఇంకో సెట్టు బ్యాటరీ, అగ్గిపెట్టలు,



సిగరెట్లు, లాంతరులోకి కిరసనాయిలు, ఎట్ట పొయ్యి ఎట్టొస్తదో అని నాలుక్కేజీల బియ్యం, కూరగాయలు, స్వామి హోటలు కాణ్ణుంచి ఒక లీటరు పాలు, టీ పొడి, చక్కెర, పిలకాయల చిరుతిళ్లకి రెండు పాకెట్ల వేరుశనగ ముద్దలు...

మా అమ్మ వానలో తడస్తానే మా ఇంటి బయటి గోడ మీద ఉన్న పూల కుండీలన్నీ తీసి వరండాలో పెడతా ఉంది.

నన్ను చూసి 'పైన నీళ్ల ట్యాంకు మీద రేకు మూసుంది. గబాల్న పొయ్యి దాన్ని తీసుకు రాబో. మళ్లా గాలికి ఎగిరిపోబోద్ది' అని, రాబోయే గాలివానకి మా సన్నజాజి చెట్టు మండలన్నీ చెదిరిపోకుండా నైలాను దారంతో ఆడాడా గట్టిగా బిగించి కట్టింది.

'ఏమ్మే. రాత్రికి మీ నాయనోళ్లు వస్తారంటనా రారంటనా?' అన్నాడు మా నాయన మా అమ్మతో.

'ఏమో. వచ్చేవాళ్లయితే ఈ పాటికి కబురు పంపేవాళ్లు గదా?' అంది మా అమ్మ, చెట్టు కుదుళ్లలో ఉండే చెత్తంతా తీసి బయట పారబోస్తా.

'అదేందిమ. అసలే వాళ్లది హలకా డలకా యిల్లు. గాలికి యాడ నిలుస్తది. ప్రతిసారీ మనింటికే గదా వస్తారు' అన్నాడు మా నాయన.

'ఏమో. మనం పిలవలేదు. వాళ్లు వస్తామనలేదు. జరీనా వాళ్లు వస్తామన్నారు. రమ్మన్నాను. ఈ ఖర్చు చాల్లే' అంది మా అమ్మ.

అయినాగానీ మా నాయనకి మనసులో ఏదో పీకతానే ఉన్నట్టుంది.

'రేయ్. పొయ్యి మీ అమమ్మోళ్లని నేను రమ్మన్నాని చెప్పి పిలచకరాపో. తొందరగా వచ్చెయ్యమని చెప్పుపో' అన్నాడు నా బుజం మీద చెయ్యేసి గేటుదాకా పంపిస్తా.

నేను గొడుగు తీసుకొని పోబోతా ఉన్నాను వాన పెద్దదయిపోయింది.

ఏం వానా. ఏం వానా. మద్యానం మూడయ్యేటప్పటికే ఊరంతా చీకటి పడిపోయింది. మూడున్నరా నాలుగూ అవతా ఉంటే మా జరినాంటీ, జరినాంటీ బర్త వాజిద్ సాయెబు, వాళ్ల ఆరుగురు పిలకాయలు గజగజమని వొణకతా తడిసి ముద్దయిపొయ్యి మా యింట్లోకి అడుగుపెట్టినారు.

'అకా. వానకి గొడుగులు కూడా నిలవడంలా. సాయంత్రం దాకా ఆగితే యింకా కష్టమయ్యేట్టుందని ఇప్పుడే వొచ్చేశాము. ఇయ్యాల చాలా పెద్ద తుపానే కొట్టేట్టుందకా' అంది మా జరినాంటీ వొచ్చీ రావడంతోటే పిలకాయల తలకాయలు తుడస్తా.

మా వాజిద్ అంకులు తడిసిన కోడిలాగ కుర్చీలో కూలబడినాడు.

'నీ సంగతి నువ్వు చూసుకున్నావు. మీ అమ్మోళ్ల సంగతి ఏందిమే' అన్నాడు మా నాయన.

'ఏమో దూలేజాన్. నేను ఆ పక్క పోలా. ఆరాం పుప్పూ వాళ్లది మిద్దే గదా. ఈసారికి వాళ్లింటికి పోతారేమోలే' అంది జరీనాంటీ.

సాయంత్రమయ్యింది. గాలి మొదలయ్యింది. ఓం ప్రదమంగా కరెంటు పొయ్యింది. వాన ఈడ్చీడ్చి కొడతా ఉంటే ఆ వానలోనే మా తూరుపు పక్క పల్లెల నుంచి జనాన్ని ట్రాక్టర్లలో తీసకొచ్చి మా యింటి ఎదురుగా ఉండే గల్లీస్కూల్లో దించారు. ఆడా మగా ముసలీ ముతకా పిల్లాజెల్లా చెంబూ తపేళాలతో వాళ్లు బిలబిలమంటా దిగిపోయేసరికి వానగోలతో పాటు వాళ్ల గోల కూడా మొదలయిపోయింది. వాన వాళ్లందరినీ మింగుదునా అన్నట్టుగా దూకతా ఉంది.

'ఏమ్మే... నాకేందో డౌటుగా ఉంది. మీ నాయన చాదస్తం మనిషి. మనింటికి రావడానికే పదహారు లెక్కబెడతాడు. ఆరాం వాళ్ల యింటికి పోడు. ఎందుకైనా మంచిది చూసొస్తా' అన్నాడు మా నాయన.

మా అమ్మ గయ్యి మంది.

'సాసాల్లే ఊరుకోవయ్యా. ఇంతవానలో కాలు బయటపెడితే తిరిగి ఇంట్లోకి రాగలిగేదానికేనా. ఏమి. వాళ్లు పాలు తాగే పసిబిడ్డలా. మబ్బు మొకం చూడగానే మా అమ్మ తయారయిపోయి యాణ్ణో ఒకదిక్కడ దిగబడిపోయే ఉంటుంది ఈ పాటికి. వాళ్లకేమీ కాదు. ఊరుకో' అని బలవంతంగా కూచోబెట్టింది.

జరినాంటీ, మా అమ్మా లాంతరు ముందరే కూచుని గబగబా రొట్టెలు చేసి ఉల్లగడ్డ పిట్టు వండినారు. అన్నం ఉడికించి చారు కాశారు. గాలీ వానా గదా అందరికీ ఆకలి రేగిపో యింది. గబగబా కడుపు నిండుగా లాగించేసినాం.

తొమ్మిదయ్యింది. మా నాయన రేడియో పెడితే 'రానున్న ఎనిమిది గెంటల్లో వాయు గుండము కావలి సమీపాన తీరాన్ని దాటవచ్చు. గాలి ఎనభై నుంచి వంద మైళ్ల వేగంతో వీయవచ్చు' అని డిక్లేరు చేసినారు.

గాలి ఇంక రొంత పెరిగింది. మా ఊరికి ఐదు మైళ్ల దూరంలో సముద్రం ఉందిగదా, గాలి హోరుకి సముద్రం గర్జిస్తున్నట్టుగా ఉంది మాకు.

'లోకం అంతానికి వొచ్చేసినట్టుందకా. అల్లామియా తలుచుకుంటే ఎంత? సూది బెజ్జం ఉళ్లా? దాని సందులో నుంచి ఒదిలితేనే యింత గాలి వొస్తుందంట. ఇంక గెడ్డపా రంత గాలి ఒదిలితే ఇంకేమైనా ఉందా? అందరం చీమల్లాగా ఎగిరిపోమా? లోకాన ఒకరో యిద్దరో పుణ్యాత్ములు ఉంటారు గాబట్టి దేవుడు ఊరుకుంటా ఉన్నాడుగానీ లాకుంటే మనబోటి పాపాత్ములకి ఎంతకా? రెప్పేసినంత టైము చాలు' అంది మా జరినాంటి, వేదాంతానికి పోతా.

ఆ మాటలకి మా వాజిద్ అంకులుకి బయం పుట్టింది.

'మేయ్... నువ్వా మాటలు ఆపతా' అన్నాడు అదిలిస్తా, రేడియో చెవి కాడ పెట్టుకుంటా.

మా అమ్మ అందరికీ నేల మీదే పక్కలు పరిచింది. తలో దిక్కున ఒళ్లు వాల్చాముగానీ నిద్దర్లు పడితే గదా. గాలి మరి రొంత పెరిగింది. కిటికీలన్ని మూసెయ్యడం వల్ల వాన ఎంత పడతా ఉందో మాకు తెలియడం లా.

'శ్లాబు పైన తూము బొక్కలన్నీ కర్రతో ఒకసారి పొడవాల్సింది. మూసుకుపోయి వాన నీళ్లు నిలస్తా ఉన్నాయో ఏమో' అంది మా అమ్మ దిగులుగా.

రాత్రి పదకొండయ్యింది. ఉన్నట్టుండి వాన తగ్గి గాలి మొదలయ్యింది. మైకు చెడిపోతే హారన్లలో నుంచి వస్తుంది చూడు శబ్దం అట్టాంటి ఊళతో మొదలయ్యింది గాలి. దడదడా బడబడామని పిడుగులు. గాల్లో ఏవో పెద్ద పెద్ద వస్తువులు ఎగిరిపోతా ఉన్నట్టుగా భ్రాంతి.

మా జరినాంటీ మాటలు మాట్లాడటం ఆపి ఏదో దువా మొదలుబెట్టింది. మా అమ్మ తల నిండుగా పయిట కప్పుకొని దేవుణ్ణి తలస్తా నెమ్మదిగా పెదాలు కదపతా ఉంది.

'ఏందిది కరీంభాయ్? యింత ఎప్పుడూ లేదే' అన్నాడు మా వాజిద్ అంకులు చిన్న గొంతుతో.

'తుపాను మన ఊరినే దాటతా ఉన్నట్టుంది వాజిద్. పక్కకి పోలా' అన్నాడు మా నాయన.

ఇద్దరూ కర్చీపులు తీసి తల మీద ఏసుకున్నారు. పిలకాయలం ఎవరి అమ్మల చంకల కిందకి వాళ్లం చేరుకున్నాం.

'ఇది ఉత్తినే వాన తెచ్చే తుపానుగాదు. గాలి బిర్రుగా కొడతా ఉంది. యాడికాడ లేచిపోవడం ఖాయం' అని మా నాయన అంటానే ఉన్నాడు, యాణ్ణుంచో ఏదో ఎగిరొచ్చి

దడేలుమని మా ఇంటి మీద పడింది.

మా అమ్మ ఉలిక్కిపడి 'యా గౌస్' అంది గబాల్న.

'యాల్లా' అంది మా జరినాంటీ.

వాజిద్ అంకులు బిక్కచచ్చిపోయినాడు.

'బయం లేదు. బయం లేదు. ఏదో రేకు అయి ఉంటుందిలే' అని ధైర్యం చెప్పినాడు మా నాయన.

ఊళ పెరిగింది. గాలి ఇంటి లోపలికి దూరేదానికి తలుపులనీ కిటికీలనీ తంతా ఉంది. ఆ దెబ్బకి తాళలాక తలుపు అదరతా ఉంది. ఇంక రొంత సేపటికి ఇద్దరు ముగ్గురు కలిసి బుజాలతో తంతే ఎట్టా అదురుతుందో అట్టా అదిరిపోతా ఉంది తలుపు.

మా నాయన మొకంలో నీళ్లు దిగిపోయినాయి.

'పిలకాయలని ఎనకరూములోకి పంపించి మనం ఈ ముందురూములో ఉండటం మేలు. తలుపులకి కూడా ఏద్దైనా అడ్డం పెట్టడం మేలు' అన్నాడు మా నాయన.

అది విని మా అమ్మ మమ్మల్ని గట్టిగా అదుముకునింది. మా నాయనా వాజిద్ అంకులూ కలిసి మా ఇంట్లోని రేకు మంచాన్ని పట్టి తలుపుకి అడ్డంగా నిలబెట్టినారు. వాళ్లా పని చేస్తుండగానే గల్లీస్కూల్లో నుంచి పెద్దగా కేకలూ అరుపులూ వినిపించినాయి. దబ్బున శబ్దం కూడా అయ్యింది.

'యాపచెట్టు కూలినట్టుంది. చూడబోతే ఊళ్లో ఒక్క చెట్టు కూడా మిగిలేట్టుగా లేదు. నేరుగా కూలితే పర్లా. ఇళ్ల మీద కూలితేనే డేంజరు. ఒక్కరు కూడా మిగలరు' అన్నాడు మా నాయన.

నాకు అదురుపుట్టి పోయింది ఆ మాటలకి. మురళీగాడు గుర్తుకొచ్చినాడు. వాళ్ల ఇంటి ముందర ఉండే యాపచెట్టు చాలా పెద్దది. దాని మాను ఈ పక్క వాడూ ఆ పక్క నేనూ కలిసి చుట్టుకుంటే ఎంత లావు ఉంటుందో అంత లావు ఉంటుంది. అది గనక మురళీవాళ్ల యింటి మీదకి కూలితే...

'చాలా బయంగా ఉంది బా' అన్నాను మా నాయన కాడికి పొయ్యి.

మా నాయన నన్ను దగ్గరగా కూచోబెట్టుకున్నాడు.

మా జరినాంటీ అందుకుంది.

'కానాధజ్జాల్ అని ఉంటాడంటకా ఒంటికన్ను దుష్టుడు. వాణ్ణి అల్లామియా బందించి పెట్టి ఉంటాడంట. లోకం అంతమయ్యేటప్పుడు ఆ కానాధజ్జాల్ బూమ్మీదకి అడుగుపెడతాడంట. అప్పుడు కుంబవృష్టి కురిసి సముద్రం పొంగుతుందంట. చూడబోతే యియ్యాల కానాధజ్జాల్ వచ్చేట్టుగున్నాడకా' అంది, లేచి మా అమ్మ పక్కన కూచుంటా.

మా అమ్మ ఏమీ మాట్లాడలా. ఎప్పుడూ బయం లేనట్టుగా అవుపించే మనిషి. మాటా పలుకూ లాకుండా ఉంది.

అరగంట గడిచింది. ఉన్నట్టుండి గాలి ఆగిపోయింది. వాన కూడా ఆగిపోయింది. చీమ చిటుక్కుమన్నా వినపడేంత నిశ్శబ్దం.

మా నాయన కాసేపు అట్టాగే చెవులొగ్గి యిని 'అమ్మయ్య. దాటేసింది. ఇంక బయం లేదు' అన్నాడు తీరుబడిగా సిగరెట్టు ముట్టించుకుంటా.

'అంతేనంటవా కరీంభాయ్?' అన్నాడు మా వాజిద్ అంకులు, నెత్తి మీది నుంచి కర్చీఫు తీసి అల్లామియాకు షుక్రియా చెప్పుకుంటా.

మా అమ్మా, జరినాంటీ మొకామొకాలు చూసుకొని నవ్వుకున్నారు.

'ఇట్టా ఒక గెంట ఉంటుంది. ఆ తర్వాత వాన మొదలవుతుంది. తుపాను దాటాక కొట్టే వాన చాలా పెద్దంగుంటది. పెద్ద పెద్ద డేగలు, రాబందులు రాలిపడతాయి దాని దెబ్బకి' అన్నాడు మా నాయన.

అందరం తలుపులు తీసుకొని బయటకొచ్చినాం. గబ్బగియ్యంగా ఉంది. టార్చిలైటు వేసినా ఏమీ అవుపించడం లా. వీదిలోకి వచ్చి నిలబడితే నెమ్మదిగా ఒక్కొక్కరే టార్చిలైట్లు లాంతర్లు పట్టుకొని బయటికొస్తా ఉన్నారు. ఏ చెట్లు కూలినాయో, ఏ ఇళ్లు పడిపోయినాయో, ఏ స్తంబాలు ఒంగిపోయినాయో చూస్తా ఉన్నారు.

టీ బంకు సుందరయ్య వచ్చి మా నాయనను గుర్తుపట్టి 'ఏం కరీంభాయ్. టైము బాగుంది. బతికినాం పో' అన్నాడు నవ్వతా.

'అంతే అంతే' అన్నాడు మా నాయన.

ఈ లోపల నలుగురైదుగురు మా పాతూరు కుర్రోళ్లు లుంగీలు పైకి గట్టి సస్తా బతకతా ఇళ్లకి పరిగెడతా ఉన్నారు ఆ చీకట్లో.

సుందరయ్య వాళ్ళని చూసి గాబరాపడి, 'ఒరే ఒరే... యాణ్ణుంచిరా యాణ్ణుంచిరా' అన్నాడు ఆపి.

'ఏం చెప్పమంటావు స్వామీ. మమ్మల్ని మేము చెప్పుతో కొట్టుకోవాల. బుద్ధిమాలుకొని సెకండ్‌షోకి పోయినాం. ఇప్పటిదాకా హాల్లోనే యిరుక్కు పోయినాం. బతికినామంటే మేలే. పోలేరమ్మకి రేపు టెంకాయ కొట్టాలా' అని అదే పరుగు.

మాకు నవ్వు ఆగలా అది చూసి.

'ఏమ్మే. టైముందిగదా. ఒకసారి మీ అమ్మోళ్లింటిదాకా పొయ్యి చూసేసొస్తా. నా మాటిను. ఎందుకైనా మంచిది' అన్నాడు మా నాయన.

'అబా, నేను కూడా వొస్తానబా' అన్నాను నేను దారిలో మురళీ వాళ్ల ఇల్లు కూడా గమనించవచ్చని.

'సరే. ఒకరికొకరు తోడుంటారు. గబాల్న పొయ్యిరాండి. వాళ్లు ఎట్టున్నారో ఏందో' అంది మా అమ్మ టార్చిలైటు అందిస్తా.

యిద్దరం చేతులు చేతులు పట్టుకొని బయలుదేరినాం. దారిలో మురళీవాళ్లింటి దగ్గర ఆగినాం. టార్చిలైటు తీసి యాపచెట్టు మీదకి వేసినాడు మా నాయన. చెట్టుకేం కాల. గట్టిగా నిలబడి ఉంది.

'ఏం కాలేదులే' అన్నాడు నాతో.

దారిలో టెలిపోను స్తంబాల తీగలు, బొంత రాళ్లు, కొమ్మలు, మండలు దాటుకొని మా అమమ్మోళ్లింటికి చేరుకుని ఇంటికేమైనా అయ్యుంటుందేమోనని బయం బయంగా

చూసినాం. దేవుడి దయవల్ల ఏం గాలా.

'అమో. అమో. తాతో. తాతా' అని పెద్దంగా కేకేసినాను నేను.

'ఓయ్' అంటా జవాబిచ్చినాడు మా తాత.

మా నాయన గుండె గుబేలుమంది.

'చూసినావా. నేను చెప్పలా. యీళ్లు యింట్లోనే ఉంటారని' అన్నాడు- పైకి 'మేము మేము' అని పెద్దగా కేకేస్తా.

మా అలికిడికి యింట్లో వాళ్లంతా గబగబా బయటికొచ్చినారు. మా నాయనకు కోపం వచ్చేసింది.

'మా యింటికి రాకుండా ఈడ సావకపోతే ఏమీ? పాండి పాండి ఇప్పటికైనా పాండి' అన్నాడు.

'పులిహోర చేసుకొని బయలుదేరదాం అనుకున్నాం. ఈలోపలే వాన పెద్దదయి పొయ్యింది. ఇరుక్కుపొయ్యాం. ఇంతదాకా అరచేతల్లో పెట్టుకున్నాం ప్రాణాలు. మీరొచ్చారు ఎట్టాగో' అన్నాడు మా తాత.

అందరం ఒకరి చేతులు ఒకరం పట్టుకొని జాగ్రత్తగా మా ఇంటికి చేరినాం.

మేము చేరిన అరగంటకి తుపాను దాటిన వర్షం మొదలయ్యి ఒక పగలు ఒక రాత్రి కొట్టింది.

ఆ మరుసటి రోజు తెల్లారినాక ఇప్పటికే రెండు రోజులు వృదా అయినాయని చెప్పి మూడో రోజు సెలవు యివ్వకుండా పాటాలు మొదలుబెట్టించినాడు కుమారస్వామి ఐవోరు.

తుపానుకున్న దయ మా ఐవోరికి లేదే అని మొకామొకాలు చూసుకుంటా పుస్తకాలను తెరిచినాం మేము.

■